ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కరీంనగర్

5 జిల్లా వార్తలు

బుధవారం 28 ఆగస్టు 2024

బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

గణేశ్‌నగర్, ఆగస్టు 27: ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డ్ (పీఎంఆర్‌బీపీ) కోసం 5 నుంచి 18 సంవత్సరాలలోపు బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. సృజనాత్మకత, మంచి అభ్యాస వాతావరణం, సాంస్కృతిక, కళలు, సాహసం, క్రీడలు, సామాజిక సేవ, శాస్త్ర, సాంకేతిక, ఇతర రంగాల్లో ప్రతిభ చూపిన బాలబాలికలు ఈ నెల 31లోగా https//www.awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు డీసీపీవో శాంతను ఫోన్ నెంబర్లో 8332987862 సంప్రదించాలని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి..

- కలెక్టరేట్, డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఆందోళనలు
- ప్రభుత్వం పట్టించుకోవాలని డిమాండ్

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్, డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట మంగళవారం పలు సంఘాలు ఆందోళనలు నిర్వహించాయి. పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మికులు, షరతులు లేకుండా రుణమాఫీ వర్తింపజేయాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఎటువంటి పారితోషికం ఇవ్వకుండా అధికారులు బీసీజీ సర్వే చేయించాలని చూస్తున్నారని, తమను సర్వే నుంచి మినహాయించాలని ఆశా కార్యర్తలు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు.

పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ వర్కర్‌లు

సుభాష్‌నగర్, ఆగస్టు 27: గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు రెండు నెలల నుంచి ఆరు నెలల వరకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 300 మంది వరకు కార్మికులు మల్టీపర్పస్ వర్కర్స్‌గా ఆన్‌లైన్‌లో నమోదు కాలేదన్నారు. అలా పని చేస్తున్న కార్మికులకు 51 జీవో ప్రకారం 9,500 రూపాయలు జీతం ఇవ్వకుండా అతి తక్కువగా ఇస్తున్నారని విమర్శించారు. గ్రామ పంచాయతి కార్మికులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇన్సూరెన్స్ డబ్బులు పంచాయతీ నిధుల నుంచి చెల్లించాలని ఉత్తర్వులు ఉన్నప్పటికీ కార్మికుల వేతనాల నుంచి చెల్లిస్తున్నారని విమర్శించారు. కార్మికులకు రెండు జతల దుస్తులు ఇవ్వాలని జీవోలు ఉన్నప్పటికి అధికారులు అమలు చేయడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాచర్ల మల్లేశం, ప్రధానకార్యదర్శి కొప్పుల శంకర్, ఇ రవీందర్, కె సదయ్య, మహిపాల్, సారయ్య, లక్ష్మీ, ఉమా, కొమురయ్య, రాము, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం ఏఐకేఎస్ నాయకులు

సుభాష్‌నగర్, ఆగస్టు 27: ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచినా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదన్నారు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాసంగి, వర్షాకాలానికి సబంధించిన రైతు భరోసా డబ్బులు చెల్లించాలని, రైతులకు ఎలాంటి నష్టం జరిగినా సీపీఐ చూస్తూ ఊరుకోదన్నారు. రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి కంది రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ రుణమాఫీలో అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయని తెలిపారు. రైతు కుటుంబాలను గుర్తించేందుకు ప్రభుత్వం సర్వే చేస్తామని ప్రకటించిందని, ఆ సర్వేను వెంటనే పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పొనగంటి కేదారి, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు అందె స్వామి, నాయకులు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఎలగందుల రాజయ్య, చిన్న స్వామి, నలువాల సదానందం, పుట్ట సంపత్, మంద ఎల్లయ్య, నాంపెల్లి బాపురెడ్డి, ఉస్మాన్, పుల్లయ్య, రాములు పాల్గొన్నారు.

పారితోషికం లేకుండా సర్వే చేసేది లేదు



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

సుభాష్‌నగర్, ఆగస్టు 27: పారితోషికం లేకుండా అడల్ట్ బీసీజీ సర్వే చేసేదిలేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి అన్నారు. అడల్ట్ బీసీజీ సర్వేకు పారితోషికం ఇవ్వాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఆశా కార్యకర్తలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అడల్ట్ బీసీజీ సర్వే చేయాని ఆశాకార్యకర్తలపై జిల్లాలో అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వివరించారు. ఈ సర్వేకు ఎలాంటి పారితోషికం నిర్ణయించలేదన్నారు. బీసీజీ సర్వే నుంచి ఆశా కార్యకర్తలకు మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో చేసి లెప్రసీ, పల్స్ పోలియో, టీబీ, ఎన్నికల డ్యూటీ, ఎగ్జామ్ డ్యూటీకి సంబంధించిన బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ధర్నా వద్దకు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత వచ్చి వారి సమస్యలను విన్నారు. వారి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళతానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుడికందుల సత్యం, సహాయ కార్యదర్శి పున్నం రవి, ఆశా వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి మారెళ్ల శ్రీలత, ఉపాధ్యక్షులు లక్ష్మి, శంకరమ్మ, ప్రియాంక, శ్యామల, లత, రజియ, రజిత, సత్యలక్ష్మి, సదా, సరోజన పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో కలకలం

- మేయర్, డిప్యూటీ మేయర్ మధ్య భగ్గుమన్న విభేదాలు
- వివాదాస్పదమైన విదేశీ పర్యటన
- ఆరోపణలు, ప్రత్యారోపణతో వేడెక్కిన రాజకీయం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 27: బీఆర్‌ఎస్‌లో కలకలం రేగింది. మేయర్ యాదగిరి సునీల్‌రావు 23న అమెరికా పర్యటనకు వెళ్లారు. ఆయన డిప్యూటీ మే యర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించకపో వడంతో విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. పాలకవర్గం ఏర్పడిన 55 నెలలుగా నగరపాలక సంస్థలో ఏనాడూ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోలేదు. త్వరలో గడువు ముగియనున్న తరుణంలో మేయర్, డిప్యూటీ మేయర్ ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకోవడం బీఆర్‌ఎస్‌లో కలకలం సృష్టించింది.

● ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించలేదంటూ..

ఈనెల 23న మేయర్ యాదగిరి సునీల్‌రావు తన వ్యక్తిగత కుటుంబ పనుల నిమిత్తం అమెరికాకు వెళ్తూ పదిహేను రోజుల్లో తిరిగి వస్తానంటూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. నిబంధనల మేరకు 14 రోజులపాటు ప్రజలకు అందుబాటులో లేకుండా ఇతర ప్రాంతాలకు వెళితే డిప్యూటీ మేయర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలని మున్సిపల్ చట్టంలో ఉందని, తాను బీసీ మహిళను కావడంతోనే ఇవ్వలేదని డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్ విమర్శించారు. తనకు ఇన్‌చార్జి మేయర్‌గా బాధ్యతలు అప్పగించాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

● మేయర్‌కు కలెక్టర్ నోటీసు

ఈ మేరకు కలెక్టర్ మేయర్‌కు నోటీసును జారీ చేయడం, ఆయన 15 రోజుల్లోనే అంటే సెప్టెంబరు 5న అమెరికా నుంచి బయలు దేరి 6న రాత్రి వరకు కరీంనగర్‌లో ఉంటానంటూ ఫ్లైట్ టికెట్‌ను కలెక్టర్‌కు పంపించారు. దీంతో వీరిద్దరి మధ్య వివాదం ముగిసిపోతుందని అంతా భావించారు. మంగళవారం డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, తన భర్త, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌తోకలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి బీసీ మహిళను అయినందునే ఇన్‌చార్జి ఇవ్వకుండా తనను అగ్రవర్ణాలకు చెందిన మేయర్ తనను అవమానపరిచారని విమర్శించారు. మేయర్ వచ్చే వరకు తాను నగరపాలనపై దృష్టిపెడతానని స్పష్టం చేశారు.

- భార్యభర్తలిద్దరికీ పార్టీ రెండు పదవులను అప్పగించినా పదవీకాంక్షతో తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నా రంటూ మేయర్ సునీల్‌రావు అమెరికా నుంచి వీడియోతోపాటు పత్రికా ప్రకటనను విడుదల చేశారు. మున్సిపల్ చట్టంలోని నిబంధనల మేరకే విదేశీ టూర్‌కు వెళ్లానని, మేయర్ ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వలేదంటూ తనపై ఆరోపణలు చేయడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమంటూ ధ్వజమెత్తారు. మరోవైపు వారిద్దరిపై చర్య తీసుకోవాలని బీఆర్‌ఎస్ అధిష్టానాన్ని కోరారు. బల్దియా ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కీలకమైన పోస్టుల్లో ఉండి విమర్శించుకోవడంతో పార్టీకి నష్టం కలుగుతుందని, ఇది ఇతర ప్రతిపక్షాలకు అవకాశమివ్వడమేనంటూ పార్టీ సీనియర్లు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనల మేరకే అమెరికా పర్యటన



- అవినీతికి ఆస్కారం లేదు
- డిప్యూటీ మేయర్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడిపై చర్య తీసుకోవాలి
- మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 27: మున్సిపల్ చట్టంలోని నిబంధనల మేరకే తాను అమెరికా పర్యటనకు వెళ్లానని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. తనపై డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నానంటూ ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. వ్యక్తిగత పర్యటన నిమిత్తం రెండు వారాలు అమెరికాకు వెళ్తున్నాని పాలకవర్గసభ్యులకు, కమిషనర్‌కు, విలేకరులకు, ప్రజలకు సమాచారమిచ్చానని చెప్పారు. తాను మున్సిపల్ చట్టం నిబంధనల మేరకే అమెరికా పర్యటనను రెండు వారాలకు రూపొందించుకున్నానన్నారు. అయినా బీఆర్‌ఎస్ నగరశాఖ అధ్యక్షుడు హరిశంకర్, ఆయన సతీమణి డిప్యూటీ మేయర్ స్వరూపరాణి తనపై ఆరోపణలను చేస్తున్నారని విమర్శించారు. తనపై ఆరోపణలు చేయడం వారి రాజకీయ దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. ఇప్పటి వరకు మేయర్‌గా పాలకవర్గ సభ్యులందరిని కలుపుకొని ఏకతాటిపై ఉంచి అధికారులను సమన్వయం చేసుకుని నగరాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశానన్నారు. రెండు పదవులను అనుభవిస్తున్న వారిద్దరిపై చర్య తీసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టానాన్ని కోరుతున్నానని తెలపారు. ఏనాడు తను పదవుల కోసం పరుగెత్తలేదని, ప్రజల మధ్య ఉండి పనిచేశానన్నారు. తాను నమ్ముకున్న పార్టీకి నిజాయితీగా, న్యాయబద్ధంగా పనిచేశానని, ఏ రోజు కూడా వెన్నుపోటు పొడిచే కార్యక్రమాలను చేపట్టలేదని తెలిపారు. వారం పది రోజుల కోసం ఇన్‌చార్జి మేయర్ బాధ్యతలు అప్పగించలేదనే దిగజారుడు ఆలోచనను ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. అవినీతికి ఏమాత్రం ఆస్కారం లేకుండా పనిచేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అవినీతి జరిగిందంటూ ఆరోపించడంతో తానే స్వయంగా అవినీతి జరిగితే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరానని సునీల్‌రావు గుర్తుచేశారు. నాలుగు సంవత్సరాల ఏడునెలల కాలంలో పార్టీ అప్పగించిన పనులు తప్ప ఏ ఒక్క రోజుకూడా నగరాన్ని విడిచి వెళ్లలేదన్నారు. నిబద్ధతతో పనిచేయడం వల్లనే నగరంలో అభివృద్ధి జరిగిందని, తనపై ఇలాంటి ఆరోపణలు చేయడం సరికాదని సునీల్‌రావు ఖండించారు.

బీసీ మహిళ కావడంతోనే చార్జి ఇవ్వలేదు.



- 55 నెలలుగా అవమానాలను భరిస్తూ వచ్చా
- మేయర్ వ్యవహారశైలిపై అధిష్టానానికి ఫిర్యాదు చేశా
- డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 27: బీసీ మహిళ కావడం వల్లనే మేయర్ యాదగిరి సునీల్‌రావు తనకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించకుండా అవమానపరిచారని డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె డిప్యూటీ మేయర్ భర్త, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తనకు మేయర్ పదవిపై ఎలాంటి వ్యామోహం లేదని తెలిపారు. మున్సిపల్ చట్టంలోని నిబంధనల మేరకు 14 రోజులు ప్రజలకు దూరంగా ఉంటే డిప్యూటీ మేయర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాలన్నారు. ఈ మేరకు తాను కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడంతో ఆమె వెంటనే మున్సిపల్ కమిషనర్ నుంచి వివరణ తీసుకొని మేయర్ సునీల్‌రావుకు నోటీసు ఇచ్చారన్నారు. 33 రోజులు వ్యక్తిగత పనులపై అమెరికాకు వెళ్తున్నట్లు ఆయన టికెట్ రిజర్వేషన్ చేసుకున్నారని, కలెక్టర్ నోటీసు ఇవ్వడంతో సెప్టెంబరు 5న తిరిగి వచ్చేందుకు ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకుని కలెక్టర్‌కు పంపించారని అన్నారు. నగరపాలక సంస్థలో జరుగుతున్న అవినీతి వెలుగు చూస్తుందనే తనకు చార్జి ఇవ్వకుండా ముందుగా తిరిగి వస్తున్నారని విమర్శించారు. ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వకున్నా తాను డిప్యూటీ మేయర్‌గా నగర ప్రజలకు, పాలకవర్గ సభ్యులకు అందుబాటులో ఉండి వినాయక చవితి ఏర్పాట్లు, సీజనల్ వ్యాధులు ఇతరత్రా సమస్యల పరిష్కారానికి అధికారులతో చర్చించి పరిష్కరిస్తానన్నారు. ఒకవేళ అవినీతి జరిగితే ఊర్కొనే ప్రసక్తేలేదని డిప్యూటీ మేయర్ స్వరూపరాణి స్పష్టం చేశారు. ఇది సునీల్‌రావు ఇచ్చిన పదవికాదని గుర్తుంచుకోవాలని చెప్పారు. డిప్యూటీ మేయర్ అయినప్పటికీ తనను ఇప్పటి వరకు ఎక్కడా ప్రారంభోత్సవాలకుగానీ పిలువకుండా అవమానపరిచినా పార్టీకి నష్టం జరిగినా ఓపిక పట్టామన్నారు. ఇకపై ఊర్కొనే ప్రసక్తే లేదన్నారు. మేయర్ పదవిని ఇప్పించిన మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌నూ మేయర్ సునీల్‌రావు వెన్నుపోటు పొడిచారంటూ విమర్శించారు.

వసతి గృహాలను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి

- విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి
- కలెక్టర్ పమేలా సత్పతి



హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

చొప్పదండి, ఆగస్టు 27: సాంఘిక సంక్షేమ వసతి గృహాలను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం చొప్పదండిలోని సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో గదులను, వంటలను ఆమె పరిశీలించారు. విద్యా బోధన, హాస్టల్ పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యల గురుంచి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి వసతి గృహాలను మరింత బలోపేతం చేస్తుందని ఆమె తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని, వసతి గృహాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

● పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్

చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు, ఓపీ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న పలువురితో ఆమె మాట్లాడి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళ క్లినిక్‌ను ఆమె పరిశీలించి మహిళలకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రతి రోజూ తప్పకుండా శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, తహసీల్దార్ నవీన్‌కుమార్ ఎంపీడీవో వేణుగోపాలరావు, డీఎంహెచ్‌వో సుజాత, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ప్రిన్సిపాల్ స్వాతి, వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఇస్కాన్ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 27 : మండలంలోని ఆపెద్దాపూర్ గ్రామ శివారులోని ఇస్కాన్ మందిరం కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ మందిరంలో రాధాకృష్ణుడికి ప్రత్యేక అభిషేకాలు, రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు, హారతి వంటి కార్యక్రమాలను చేపట్టారు. పలు జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. పలువురు భక్తులు 56 రకాల పిండి పదార్థాలతో తయారు చేసిన నైవేద్యాన్ని స్వామి వారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు భక్తులకు భోజన ప్రసాదం వితరణ చేశారు. చిన్నారులు శ్రీకృష్ణుడి, గోపికల వేషధారణతో అలంకరణతో వచ్చిన వారు ఆలయంలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టి అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు అందరిని అలరింపిచేశాయి. అనంతరం సోమవారం అర్ధరాత్రి వరకు భక్తులు హరినామ సంకీర్తనలతో భజన కార్యక్రమంలో భక్తి పారవశ్యంతో ఆనందంగా గడిపారు. నాయకులు, ఇస్కాన్ నిర్వహకులు, భక్తులు పాల్గొన్నారు.


పెద్దాపూర్ ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

గోదాంల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించండి

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల అర్బన్, ఆగస్టు 27: గోదాంల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వల కోసం వివిధ ప్రాంతాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో గిడ్డంగులు నిర్మించారని దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలో నాలుగు దశాబ్దాల క్రితం సుమారు 20 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గిడ్డంగులు నిర్మించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రవాణా చేపట్టే పీడీఎస్ బియ్యంతో పాటు, ఫర్టిలైజర్స్, నూనె ఉత్పత్తులు, విత్తనాలు, నిల్వ చేపడుతుండడంతో సుమారు పది మందికి పైగా గోదాముల్లో నిల్వ చేసే ఉత్పత్తులను స్థానిక కార్మికులు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తూ ఉపాధి పొందుతు న్నారన్నారు. గత ప్రభుత్వం జగిత్యాల జిల్లాకు మంజూరు చేసిన మెడికల్ కళాశాల నిర్వహణకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన గోదాంలను కేటాయించడంతో వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ చేసేందుకు ప్రైవేట్ గోదాములపై ఆధారపడవల్సి వస్తుందన్నారు. గిడ్డంగుల నిర్మాణం కోసం స్థలం కేటాయించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

11 కేవీ విద్యుత్ లైన్ పనులు అడ్డుకున్న గ్రామస్థులు

శంకరపట్నం, ఆగస్టు 27: మండలంలోని కన్నాపూర్‌లో ఇళ్ల మధ్య నుంచి 11 కేవీ విద్యుత్ లైన్ వేయవద్దని విద్యుత్ సిబ్బందిని గ్రామస్థులు మంగళవారం అడ్డుకున్నారు. అర్కండ్ల శివారులో రైస్‌మిల్ నిర్మిస్తున్నారు. కన్నాపూర్ సబ్‌స్టేషన్ నుంచి రైస్‌మిల్‌కు విద్యుత్ అందించేందుకు పనులు ప్రారంభించారు. ఇళ్ల మధ్య నుంచి విద్యుత్ లైన్ వేయవద్దని గ్రామస్థులు పనులు అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న తాడికల్ ఏఈ సంపత్‌రెడ్డి అక్కడకు చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. ఇళ్ల మధ్య నుంచి విద్యుత్ లైన్ వేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వేరే ప్రాంతం నుంచి వేసుకోవాలని వారు ఏఈకి సూచించారు. గ్రామంలో తాగునీటి పైప్‌లైన్లు ఉన్నాయని, విద్యుత్ స్తంభాల కోసం గుంత తీస్తే అవి పగిలిపోయే అవకాశం ఉందన్నారు. విద్యుత్ లైన్ వేయవద్దని గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు ఏఈ సంపత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.


ఏఈతో మాట్లాడుతున్న గ్రామస్థులు

ఆలయంలో చోరీ

వీర్నపల్లి, ఆగస్టు 27 : వీర్నపల్లి మండలం బాబాయ్ చెరువు తండా గ్రామంలోని జగదాంబ ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ తాళాలు పగలగొట్టి డబ్బులను ఎత్తు కెళ్లారు. స్టేషన్ హౌస్ ఇన్ చార్జి బాబు కథనం ప్రకారం.. మంగళవారం ఉదయం ఆలయం వద్ద హుండీ తాళాలు పగలగొట్టి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో అక్కడికి చేరుకొని హుండీతో పాటు పరిసరాల ప్రాంతాలను పరిశీలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైన్స్‌లో మద్యం..

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 27: సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో గల శ్రీ లక్ష్మీనర్సింహ వైన్స్‌లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వైన్స్ తాళం పగుల గొట్టిన దొంగలు లోనికి చొరబడి కౌంటర్‌లో ఉన్న రూ.20 వేల నగదు, మరో రూ. 10 వేల మద్యం ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌ను కూడా దొంగలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం 10 గంటలకు వైన్స్ తెరిచేందుకు నిర్వాహకులు వచ్చి చూడగానే తాళం పగులగొట్టి కౌంటర్ తెరిచి ఉండడంతో ఆందోళన చెందారు. ఈ సంఘటనపై వైన్స్ యజమాని శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గంజాయి విక్రేత రిమాండ్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 27: మండలంలోని హరిదాస్‌నగర్ గ్రామ శివారులో గంజాయి విక్రయిస్తున్న వేములవాడ అర్బన్ మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన వేముల సాయికృష్ణను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 150 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. ఈ నెల 26న మండలంలోని హరిదాస్‌నగర్ గ్రామ శివారులో గంజాయి అమ్ముతూ సాయికృష్ణ పట్టుబడ్డాడని చెప్పారు. వేములవాడ పట్టణంలోని కొందరు వ్యక్తుల వద్ద నుంచి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల పట్టణాలతో పాటు పరిసర గ్రామాలకు అధిక ధరకు అమ్ముతున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. గంజాయి విక్రయిస్తున్న మరో వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది.

కత్తెరతో దాడి కేసులో ముగ్గురికి జరిమానా

జ్యోతినగర్, ఆగస్టు 27: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాజీపల్లి గ్రామంలో చింతపల్లి శ్రీనివాస్ అనే వ్యక్తిపై కత్తెరతో దాడి చేసిన కేసులో ముగ్గురు నిందితు లకు జరిమానా విధిస్తూ గోదావరిఖని అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి శ్రీనివాసులు తీర్పునిచ్చారు. 30 అక్టోబరు 2019లో ఖాజీపల్లి గ్రామంలో చింతల లింగయ్య, చింతల కోమురయ్య, చింతల సాయితేజ అనే ముగ్గురు ఒక భూ వివాదంలో శ్రీనివాస్‌పై కత్తెరతో దాడి చేశారు. అప్పటి ఎన్టీపీసీ ఎస్ఐ శంకరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ప్రస్తుత ఎన్టీపీసీ ఎస్ఐ సతీష్ సాక్షులను కోర్టులో అడిషనల్ ప్రాసిక్యూటర్ ఆకుల రాములు సమక్షంలో ప్రవేశపెట్టారు. పూర్వాపరాలు విన్న తరువాత ముగ్గురు నిందితులను దోషులుగా జడ్జి నిర్ధారిస్తూ చింతల లింగయ్యకు ఆరు వేలు, చింతల కోమురయ్య పది వేలు, సాయితేజకు ఆరు వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా కట్టని పక్షంలో ఆరునెలల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు.

వైపని కార్మికుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 27: సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో జక్కని సతీష్(29) అనే వైపని కార్మికుడు మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన జక్కని సతీష్ వైపని కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతనికి తల్లిదండ్రులు లేరు. ఒక సోదరి ఉంది. మంగళవారం ఉదయం బయటకు వెళ్లి టిఫిన్ చేసి ఇంటికి వచ్చిన సతీష్ గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. నిద్రపోయాడని భావించిన పక్క గదిలో ఉంటున్న అతని సోదరి బీడీలు ఇచ్చేందుకు కంపెనీకి వెళ్లి వచ్చింది. మధ్యాహ్నం రెండు గంటలైనా గది తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన సోదరి తమ్ముడిని ఎంత పిలిచినా స్పందించకపోవడంతో తలుపులు తెరిచేందుకు ప్రయత్నిస్తే ఎంతకు రాకపోవడంతో పైకప్పు పెంకులు ఊడదీసి చూసే సరికి సతీష్ ఉరివేసుకొని కనిపించాడు. దీంతో చుట్టుపక్కల వారిని పిలిచి తలుపులు తొలగించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని టౌన్ ఎస్ఐ శ్రీనివాసరావు సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వస్త్రపరిశ్రమ సంక్షోభంతో ఉపాధి లేక పోవడం, ఒంటరి జీవితాన్ని భరించలేక మద్యానికి అలవాటుపడి మనస్థాపం చెంది తన సోదరుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని సోదరి సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట, ఆగస్టు 27: మండలంలోని మల్యాల గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామ మానేరు పరివాహక ప్రాంతం నుంచి ప్రశాంత్ అనే వ్యక్తి ప్రభుత్వ అనుమతి లేకుండానే ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్



గాయపడ్డ అనూష్

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

పెగడపల్లి, ఆగస్టు 27 : పెగడపల్లి మండలంలోని బతికెపల్లిలో మంగళవారం వీధి కుక్కల దాడిలో పదకొండు చిన్నారి తీవ్రగాయాల పాలు కాగా జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మడిగెల నరేష్, శిరీష దంపతుల కుమారుడు బాబు అనూష్ (11నెలలు) ఇంటిముందు ఆడుకుంటుండగా వీధి కుక్క ఒక్కసారిగా బాలుడిపై దాడి చేసింది. దీంతో బాబు నుదుటి మీద తీవ్ర గాయమైంది. అప్రమత్తమైన బాబు తల్లిదండ్రులు బాబును రక్షించి వెంటనే జగిత్యాల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	24,014	4,459	80.5	58.709
ఎల్లంపల్లి	9,886	9,852	20.175	17.785
మిడ్ మానేరు	10,500	14,600	27.54	18.19
ఎల్ఎండీ	14,824	224	24.034	8.37

వివాహిత కిడ్నాప్ కేసులో ఆరుగురి అరెస్టు

- ఇద్దరు పరార్
- అరెస్ట్ అయినవారిలో మాజీ నక్సలైట్ దంపతులు
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 27: జిల్లాలోని రుద్రంగి మండలం మానాల గ్రామానికి చెందిన జక్కుల ధరణి అనే వివాహిత కిడ్నాప్‌నకు పాల్పడిన కేసులో ఆరుగురు కిడ్నాపర్‌లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివాహిత కిడ్నాప్ వివరాలను ఎస్పీ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రుద్రంగి మండలంలోని మానాల గ్రామానికి చెందిన ధరణిని బోయిన్‌పల్లి మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన కమటం కృష్ణవంశీ ప్రేమించుకొని 2022లో పెళ్లి చేసుకున్నారు. ఈ పెళ్లి ఇష్టం లేనందున ఎలాగైనా తమ కూతురి మనసు మార్చి మరో పెళ్లి చేయాలని భావించిన కుటుంబ సభ్యులు ప్రస్తుతం కామారెడ్డిలో ఉంటున్న కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన మాజీ నక్సలైట్ గొట్టె మనోహర్, అతని భార్య పద్మలను కలిసి చెప్పారు.

ఇందుకు మాజీ నక్సలైట్ మనోహర్ దంపతులు రూ.5 లక్షలు ఇస్తే పరిష్కరిస్తామని ఒప్పందంచేసుకొని ధరణిని కిడ్నాప్ చేయడానికి ఒక ఏడాది నుంచి ప్రణాళిక వేసుకున్నారు. ఆమె తల్లిదండ్రులు చందుర్తి మండలంలోని మర్రిగడ్డకు చెందిన కత్తి రాము, వేములవాడకు చెందిన ఎక్కల దేవి బాలకిషన్, టిల్లు జగదీష్‌ల సహాయంతో పథకం వేసుకొని ఓ కారు అద్దెకు తీసుకొని ఈ నెల 22న బూరుగుపల్లిలోని అత్తగారింటి నుంచి వివాహిత ధరణిని కిడ్నాప్ చేశారు. ఈ కిడ్నాప్ సమయంలో ఆమె అడపడుచు ఆపేందుకు ప్రయత్నం చేసినప్పటికీ వారి కళ్లల్లో పెప్పర్ స్ప్రే కొట్టి ధరణిని కిడ్నాప్‌చేసి కామారెడ్డి నుంచి నిజామాబాద్ జిల్లా లోని చుండూరు గ్రామం నుంచి మహారాష్ట్రలోని నాందేడ్ వైపు తీసుకెళ్లి ఆమె మనసు మార్చేందుకు ప్రయత్నం చేశారు. ఈ కిడ్నాప్ సంఘటనపై వెంటనే ఆమె భర్త బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న కిడ్నాపర్‌లు ధరణిని తిరిగి బూరుగుపల్లిలో విడిచి పెట్టారు. ఈ మేరకు రుద్రంగి మండలంలోని మానాల గ్రామానికి చెందిన జక్కు



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

లక్ష్మి, జక్కు రాజశేఖర్, చందుర్తి మండలంలోని మర్రిగడ్డకు చెందిన కత్తి రమేశ్, కోనరావుపేటకు చెందిన గొట్టె మనోహర్, గొట్టె పద్మ, కోనరావుపేట మండలంలోని మలక్‌పేటకు చెందిన ఎక్కల దేవి బాలకృష్ణలను వేములవాడ, బాలనగర్ ప్రాంతాల్లో అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు.

మిగతా టిల్లు, జగదీష్‌లు పరారీలో ఉన్నారని వీరిని త్వరలో పట్టుకుంటామని ఆయన తెలిపారు. కోనరావు పేట మండల కేంద్రానికి చెందిన గొట్టె మనోహర్ అనే మాజీ నక్సలైట్ అతని భార్య పద్మలు కామారెడ్డిలో ఉంటూ ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని చెబుతూ అమాయక ప్రజల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని వీరిపై సిరిసిల్ల, కామారెడ్డి, జగిత్యాల జిల్లాలోని పలు కేసులు నమోదు అయ్యాయని ఆయన తెలిపారు. వీరికి సంబంధించిన బాధితులు ఎవరైనా ఉంటే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని, మాజీ నక్సలైట్ పేరుతో ఎవరైనా బెదిరిం పులకు పాల్పడితే వారి సమాచారం అందించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

జానపద కళాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 27: ఉమ్మడి జిల్లాలోని 60 సంవత్సరాలు నిండిన జానపద, సంచార జాతుల కళారూపాల కళాకారులు పేర్ల నమోదు, పించన్ల కోసం పేర్ల నమోదుకు దరఖాస్తులు చేసుకోవాలని తెలంగాణ జన, జానపద వృత్తి కళాకారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సల్వాజి ప్రవీణ్, కార్యదర్శి ప్రకాశ్, ఉప కార్యదర్శి కనకం రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

డప్పులు, కోలాటం (మహిళలు, పురుషులు) కళాకారులు వారి సంస్థ, వ్యక్తిగత పేరు, సంస్థ కళాకారుని సంఖ్య పంపాలని పేర్కొన్నారు. దుబ్బ, చిందు యక్షగానం, చిరుతల రామాయణం, జడకోలాటం, వీరనాట్యం, కడ్డీ వాయిద్యం, చిరుతల, చెక్క భజనలు, కాటిపాపలు, బ్యాండ్, సన్నాయి మేళా లు, తాటిపాములవారు, సాధనాశూరులు, బుడగ జంగాలు, పాండవుల కథ, వీరప్రభలు, గొల్ల సుద్దులు, గుస్సాడి, కొమ్ము కోయ, ఒగ్గుకథ, బైండ్ల పోతు రాజులు, బోనాలు, బోనాల కోలాటం, పులివేషాలు, చెంచులు, రాజన్న డోలు, తోలు డప్పులు, నగారా, బుడుబుక్కలవారు, గంగిరెద్దులు, మొండి బండ, దాసరి, వంశరాజులు, పిచ్చగుంట్లవారు, కిన్నెర, జోగి, బాలసంతులు, బహురూపులు, మంద హెచ్చు, తెరచీరలు, అద్దం పటం, కొర్ర రాజులు, రుంజ, బుర్రవీణ, శారద గాండ్లు, గడజట్టి తదిర కళారూపాలకు చెందిన కళాకారులు పోస్టల్ లేదా కొరియర్ ద్వారా దరఖాస్తులను సెప్టెంబరు 10వ తేదీలోగా జి కృపాదానం, 7/49/2/2/2, రేకుర్తి, కొత్తపల్లి మండలం, కరీంనగర్ జిల్లా అనే చిరునామాకు పంపాలని సూచించారు. మిగతా వివరాలకు 810600 6238 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆవులను తరలిస్తున్న లారీ పట్టివేత

ఊపిరి ఆడక ఆరు మృతి





ఆవులకు చికిత్స అందిస్తున్న పశువైద్య శాఖ సిబ్బంది, లారీలో ఊపిరి ఆడక మృతి చెందిన ఆవులు

తిమ్మాపూర్, ఆగస్టు 27: అక్రమంగా ఆవులను తరలిస్తున్న ఓ లారీని తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట టోల్ ప్లాజా వద్ద పోలీసులు మంగళవారం తెల్లవారు జామున పట్టుకున్నారు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా, వాంకిడి మండలం గోరెగావ్ నుంచి హైదారాబాద్‌కు ఆవులను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించారు.

ఈ క్రమంలో ఎంహెచ్ 34 బీజీ 8497 నంబర్ లారీని తనిఖీ చేయగా అందులో ఆవులు కనిపించాయి. వాటిని అక్రమంగా తరలిస్తున్నారని గుర్తించి లారీని స్వాధీనం చేసుకుని ఆవులను ఎల్ఎండీలోని గోశాలకు తరలించారు. లారీలో 48 ఆవులు ఉండగా ఊపిరి ఆడక ఆరు వాహనంలోనే మృతి చెందాయి. చాలా ఆవులు అస్వస్థతకు గురయ్యాయి. పోలీసులు పశు వైద్యశాఖ సిబ్బందిని పిలిపించి చికిత్స అందించారు. చనిపోయిన ఆవులకు పోస్ట్‌మార్టం నిర్వహించారు. ఆవులను అక్రమంగా తరలిస్తున్న ఇమ్రాన్, సోహైల్, షాహిద్, తుకారాం, లారీ డ్రైవర్ ఫయాజ్‌అలీపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చేరాలు తెలిపారు.

బీజేపీ దక్షిణాది రాష్ట్రాల సభ్యత్వ ఇన్‌చార్జిగా ఎస్ కుమార్



గోదావరిఖని, ఆగస్టు 27: బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్‌ను దక్షిణాది రాష్ట్రాల సభ్యత్వ ఇన్‌చార్జిగా నియమించారు. ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆర్యా ఈ నియామకం చేపట్టారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు సభ్యత్వ ఇన్‌చార్జిగా ఎస్ కుమార్‌ను వ్యవహరించనున్నారు.

ఈ సందర్భంగా ఎస్ కుమార్ మాట్లాడుతూ 75 లక్షల మంది దళిత సామాజిక వర్గాన్ని సభ్యత్వ నమోదు చేయాలని నిర్ణయించడంతో పాటు దళితులకు బీజేపీ దగ్గర కావాలనే ఉద్దేశ్యంతో కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. పది సంవత్సరాలుగా ప్రధాని నరేంద్రమోదీ దళిత సామాజిక వర్గాల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టారని, బీజేపీ దేశంలో, సిద్ధాంతం, నిబద్ధతతో పని చేస్తోందని, దళిత యువతీ యువకులను పార్టీలో చేర్పించాలని హైకమాండ్ ఆదేశించినట్టు చెప్పారు.

కొండగట్టుకు శ్రావణ శోభ

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, ఆగస్టు 27: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శ్రావణ శోభను సంతరించుకుంది. శ్రావణ మాసం చివరి మంగళవారం కావడంతో వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నూతన వాహనాలకు భక్తులు స్వామి సన్నిధిలో వాహన పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్, సునీల్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

చెక్‌పోస్టు వద్ద వాహన రుసుము వసూలు

కొండపైకి అంజన్న దర్శనానికి వచ్చిన భక్తుల వాహనాలు పోలీస్ చెక్‌పోస్టు నుంచి కొండ పైకి వెళ్లడానికి దేవస్థానం అధికారులు రూ.50 వసూలు చేశారు. దీనిపై పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్లు ఇస్తూ వాహనాల రుసుము వసూలు చేయడం ఇదే మొదటి సారి అని ఇలా చేయడం ఏంటనీ ప్రశ్నించారు. దేవస్థానానికి ఆదాయం పెంచుకోవడానికి అనేక మార్గాలు ఉండగా వాటిపై దృష్టి సారించని అధికారులు వాహనాలు వెళ్లడానికి రుసుము వసూలు చేస్తున్నారని మండిపడ్డారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా వాసికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



జాతీయ సదస్సులో తాడూరి సంపత్‌కుమార్ ఇన్నోవేటర్‌ను పరిశీలిస్తున్న రాష్ట్రపతి (ఫైల్)

గంభీరావుపేట ఆగస్టు 27: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. సెప్టెంబరులో జరిగే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి అవార్డులను అందించే కేంద్ర ప్రభుత్వం 2024 సంవత్సరానికి తెలంగాణ నుంచి ఖమ్మం జిల్లా తిరుమాలయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పెసర ప్రభాకర్‌రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్‌లను ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభుత్వం జాబితాను విడుదల చేసింది. దమ్మన్నపేట పాఠశాలలో పని చేస్తున్న సంపత్‌కుమార్ సైన్స్ పట్ల విద్యార్థుల్లో అభిరుచి కలిగించడమే కాకుండా అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ఇన్నోవేటర్ల అవార్డులను స్వీకరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన సంపత్‌కుమార్ ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధతగా పనిచేస్తూ గ్రామీణ విద్యార్థులను ముందుకు నడిపిస్తున్నారు. 2022 సంవత్సరంలో దమ్మన్నపేట జడ్పీ పాఠశాలకు సైన్స్ ఉపాధ్యాయుడిగా బదిలీపై వచ్చారు. పెద్దపల్లి జిల్లా చందనాపూర్‌తో పాటు దమ్మన్నపేటలో పనిచేస్తున్న క్రమంలోనూ ఇన్నోవేటర్ల అవార్డులను అందుకున్నారు. సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 53 మంది విద్యార్థులు ఇన్నోవేటర్ల తయారీలో ప్రతిభను కనబర్చారు.

ఇందులో 16 మంది జాతీయ స్థాయిలో, 8 మంది అంతర్జాతీయ స్థాయిలో అవార్డులను అందుకున్నారు. పోలెండ్, జపాన్, దేశాల్లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో నలుగురు విద్యార్థులు అవార్డులు అందుకున్నారు. 2018 నుంచి 2023 వరకు వరుసగా జాతీయ స్థాయిలో జరిగే సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనడంతో పాటు తన మార్గనిర్దేశనంలో విద్యార్థులు పలు అవార్డులను అందుకున్నారు. పది మంది విద్యార్థులు ఇంటింటా ఇన్నోవేటర్ల పోటీలో ఐదు అవార్డులను అందుకున్నారు. సంపత్ కుమార్ ప్రభుత్వం అందించే పాఠ్య పుస్తకాల్లో 6, 7, 8 తరగతులకు సంబంధించి పాఠ్యాంశాల విభాగంలోనూ ఉన్నారు. టీ శాట్ ద్వారా ఉపాధ్యాయులు, టీచర్లకు డిజిటల్ బోధన అందిస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు సైన్స్ పట్ల అసక్తిని పెంచడమే కాకుండా తాను పదవీ విరమణ పొందే వరకు వంద ఇన్నోవేటర్లను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంపత్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఇప్పటికే 53 ఇన్నోవేటర్లను అందించినట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ, ఇన్‌స్పైర్ అవార్డులను విద్యార్థులు అందుకునే విధంగా చేయడం అనందంగా ఉందన్నారు. బంజారా భాషలోకి సైన్స్ పాఠాలను అనువదించి మాతృభాషలో వారికి పాఠాలను కూడా బోధించినట్లు తెలిపారు.

హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల మధ్య వివాదం

పెద్దపల్లి మార్కెట్‌లో ఉచితంగా కూరగాయలు పంపిణీ చేసి రిటైలర్ల నిరసన

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 27 : పెద్దపల్లి మార్కెట్‌లో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారుల మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో హోల్‌సేల్ వ్యాపారుల తీరును నిరసిస్తూ మంగళవారం రిటైల్ వ్యాపారులు ఉచితంగా కూరగాయలు పంపిణీ చేశారు. దీంతో కూరగాయల కోసం ప్రజలు ఎగబడ్డారు. మార్కెట్‌లో హోల్‌సేల్ వ్యాపారులు 30 మంది, రిటెయిల్ వ్యాపారులు 100 మందికి పైగా ఉన్నారు. హోల్‌సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారుల మధ్య ఉన్న ఒప్పందం ప్రకారం ఉదయం 8 గంటల వరకే విక్రయించాల్సి ఉండగా, పొద్దంతా హోల్‌సేల్ ధరలకే కూరగాయలను విక్రయిస్తుండడంతో రిటైల్ వ్యాపారులు నష్టపోతున్నారు. దీనిని నిరసిస్తూ సోమవారం రిటైల్ వ్యాపారులు కూరగాయల మార్కెట్‌ను బంద్ చేశారు.



పెద్దపల్లి మార్కెట్‌లో కూరగాయల కోసం ఎగబడుతున్న జనం

మంగళవారం కూడా మార్కెట్‌ను బంద్ చేసి సుమారు 30 వేల రూపాయల విలు వైన కూరగాయలను కుప్పలుగా పోసి ఉచితంగా పంపిణీ చేయడంతో ప్రజలు ఎగబడ్డారు. ఉదయం 8 గంటల నుంచి పంపిణీ మొదలు పెట్టగా రెండు గంటల్లో కూరగాయలన్నీ అయిపోయాయి. వివాదం విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు ఇరు వర్గాలను పిలిపించి మాట్లాడారు. హోల్‌సేల్ వ్యాపారులు ఉదయం 9:30 గంటల వరకు విక్రయాలు జరుపుకోవాలని, రిటైల్ అమ్మకాలు చేయవద్దని, 5 కిలోలకు తక్కువ గాకుండా మాత్రమే విక్రయించాలని ఒప్పందం కుదర్చడంతో వివాదం సద్దుమణిగింది.

మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని ఇంటికి అక్రమంగా విద్యుత్

- కనెక్షన్ తొలగించిన అధికారులు

వేములవాడ, ఆగస్టు 27: భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు, వేములవాడ మాజీ శాసన సభ్యుడు చెన్నమనేని రమేష్‌బాబు నివాసానికి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు అధికా రులు గుర్తించారు. కొన్ని సంవత్సరాలుగా చెన్నమ నేని రమేష్ నివాసానికి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి మున్సిపల్, సెస్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. చెన్నమనేని రమేష్‌బాబు నివాసమైన సంగీత నిలయం (జర్మనీ గెస్ట్‌హౌస్) లోని పలు బల్బులకు మున్సిపల్ స్ట్రీట్ లైట్స్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ నుంచి కనెక్షన్ ఇచ్చి నట్లుగా గుర్తించి తొలగించారు. మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ నివాసానికి విద్యుత్ కనెక్షన్ తొలగించినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరగడంతో పలు వురు కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. మున్సిపల్ లైన్ నుంచి అక్రమంగా వినియోగిస్తున్న విద్యుత్ కనెక్షన్‌ను తొలగించామని, అక్రమంగా విద్యుత్ వినియోగించిన బిల్లుకు సంబంధించిన సొమ్మును రికవరీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుడు, మచ్చలేని రాజకీయ నాయకుడిగా పేరు పొందిన మాజీ శాసన సభ్యుడు చెన్నమనేని రాజేశ్వరరావు కుమారుడైన చెన్నమనేని రమేష్ నివాసానికి విద్యుత్ అక్రమంగా వినియోగించినట్లు తేలడం స్థానికంగా చర్చనీయాంశమైంది.



చెన్నమనేని నివాసానికి విద్యుత్ కనెక్షన్ తొలగిస్తున్న సిబ్బంది

హత్యాయత్నం కేసులో ఒకరికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఆగస్టు 27: పాత తగాదాలు దృష్టిలో పెట్టుకుని ఇనుప రాడ్డు, కత్తితో దాడి చేసి హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడు అంకమల్ల కనకయ్య(45)కు మూడు సంవత్సరాలు జైలు శిక్ష, 2,500 రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీలేఖ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గంగాధర మండలం వెంకటాయపల్లికి చెందిన నల్లాల పోచయ్యకు, అదే గ్రామానికి చెందిన అంకమళ్ళ కనకయ్యల కుటుంబాల మధ్య తగాదాలు ఉన్నాయి. దీంతో పోచయ్య కొడుకు అనిల్‌పై కనకయ్య కక్ష పెంచుకుని 2022 మే 28న రాత్రి అనిల్, అతను భార్య పుష్పలు భవనంపై పడుకున్న సమయంలో కనకయ్య దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటనపై అనిల్ తండ్రి గంగాధర పోలీసులకు ఫిర్యాదు చేయగా కనకయ్యపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి శ్రీలేఖ నిందితుడు కనకయ్యకు జైలు శిక్ష, జరిమానా విధించారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా

కరీంనగర్ టౌన్, ఆగస్టు 27: శ్రీచైతన్య విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నగరంలోని శ్రీచైతన్య పాఠశాల ముందు పీడీఎస్‌యూ జిల్లా నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులకు, పాఠశాల యాజమాన్యానికి మధ్య వాగ్వాదం జరగడంతో పీడీఎస్‌యూ నాయకులు పాఠశాలల్లో విధ్వంసం సృష్టించే ప్రయత్నం చేశారు. దీనితో పోలీసులు వారిని అరెస్టు చేసి తొమ్మిది మంది పీడీఎస్‌యూ నాయకులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కూతాటి రాణా ప్రతాప్ మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడికి పాల్పడుతున్నారని, దీన్ని ప్రశ్నిస్తే పోలీసులతో దాడులు చేయిస్తున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. అక్రమ కేసులు, నిర్బంధాలతో విద్యార్థి ఉద్యమాలను అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

స్కూల్ కంప్యూటర్ ధ్వంసం

-పీడీఎస్‌యూ నాయకులపై కేసు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 27: కరీంనగర్ ముకరంపురలోని శ్రీచైతన్య స్కూల్‌లోకి అక్రమంగా ప్రవేశించి కంప్యూటర్‌ను ధ్వంసం చేసిన పీడీఎస్‌యూ నాయకులపై కేసు నమోదు చేశామని రెండో టౌన్ పోలీసులు తెలిపారు. మంగళవారం శ్రీచైతన్య స్కూల్‌లోకి పీడీఎస్‌యూ నాయకులు అక్రమంగా ప్రవేశించి కంప్యూటర్‌ను ధ్వంసం చేయడమే కాకుండా సిబ్బందిని అడ్డుకుని స్కూల్‌ను నడిపిస్తే చంపుతానని బెదిరించినట్లు ప్రిన్సిపాల్ సునీల్‌కాంత్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పీడీఎస్‌యూ నాయకులు కుతాటి రాణాప్రతాప్, గాలిపల్లి రోహిత్, కెమారపు రవితేజ, చిట్యాల ప్రీతమ్, మామిడిపల్లి సాయికిరణ్, కోహెడ బాబు, కొయ్యడ రాకేష్, అస్లాం, మహ్మద్ అబ్బాస్‌లపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

కృష్ణాష్టమి వేడుకల్లో అపశ్రుతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 27: కొత్తపల్లి మండలం రేకుర్తి గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. ఉట్టిని ఏర్పాటు చేసిన ఇనుప స్థంభం ప్రమాదవశాత్తుగా పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడటంతో స్తంభాన్ని తాకిన ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో గాయపడిన రేకుర్తికి చెందిన యువకులు సిద్ధు, ఆకాశ్, మరొకరిని స్థానికులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన రా రైస్‌మిల్లర్లు



అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రా రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు సురేశ్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 27: రా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తనుకు సురేశ్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఇటీవల రా రైస్ మిల్లర్ల అసోసియేషన్ నూతన కార్య వర్గాన్ని ఎన్నుకోగా మంగళవారం వారు అదనపు కలెక్టర్‌ను ఆమె కార్యాలయంలో కలిసి రారైస్ మిల్లర్ల సమస్యలను వివరించారు. అనంతరం జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా స్వీట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీతారామచంద్రస్వామి మందిర ప్రతిష్ఠా కార్యక్రమాలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 27: నగరంలోని శాతవాహన యూనివర్సిటీ సమీపంలో శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన శ్రీసీతారామ చంద్ర స్వామి మందిర ప్రతిష్ఠా కార్యక్రమాలు బుధ వారం నుంచి అత్యంత వైభవోపేతంగా జరగనున్నాయి. ఆలయంలో శ్రీ అభయాంజనేయ సహిత సీతా లక్ష్మణ సమేత రామచంద్రమూర్తి విగ్రహాల ప్రతిష్ఠలు, వైదిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మాధవరావు, గజవాడ ఆంజనేయులు, కోశాధికారి ఎస్.నరసింహాచారి, సభ్యులు పిలుపునిచ్చారు.

హైడ్రా తరహా వ్యవస్థను జిల్లాలోనూ రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గన్నేరువరం, ఆగస్టు 27: హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా తరహా వ్యవస్థను జిల్లాలోనూ రూపొందించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వివిధ గ్రామాల్లోని చెరువుల శిఖం భూములకు, ఎస్సారెస్పీ భూములకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వాటి రక్షణకు హైడ్రా తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు.

మండలంలోని గుండ్లపల్లిలో సర్వే నంబర్ 295లో 11 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న దేవుని చెరువు శిఖం భూమిని కబ్జా చేసి నిర్మించిన డెయిరీని కూల్చివేయాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి చొక్కల శ్రీశైలం, నాయకులు కూన మల్లయ్య, గర్శకుర్తి శ్రీనివాస్, బోయిని మల్లయ్య, జాలి గోపయ్య, సాగర్‌రెడ్డి నయీమ్, కిష్టయ్య పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఎంపీ ఈటల పరామర్శ

హుజూరాబాద్, ఆగస్టు 27: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లిలో ఇటీవల డెంగ్యూతో వేమునూరి విమల మృతి చెందారు. కుటుంబాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెద్దఎత్తున సభ్యత్వాలు చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

తిమ్మాపూర్, ఆగస్టు 27: ప్రతీ బూత్‌లో పెద్ద ఎత్తున సభ్యత్వాలు చేయించి పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపు నిచ్చారు. మండలంలోని కొత్తపల్లి బీజేపీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యశాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు కళ్యాణ్ చంద్ర, జోగిరెడ్డి, కొమురయ్య, శ్రీనివాస్, అరుణ్ పాల్గొన్నారు.

● శంకరపట్నం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లాలోనే శంకరపట్నం మండలాన్ని ముందు వరుసలో ఉంచాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు.

● రామడుగు: బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల శాఖాధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు.

జిల్లా జైలును సందర్శించిన న్యాయసేవాధికార కార్యదర్శి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి కె వెంకటేష్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 27: కరీంనగర్ జిల్లా జైలును మంగళవారం కరీంనగర్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి కె వెంకటేష్ సందర్శించారు. జైలులో ఖైదీల యోగ క్షేమాలను, భోజన వసతులు, న్యాయ సేవ, ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసు కున్నారు. తరువాత జైలులో క్యాంటిన్, జైలు ఆసుపత్రి, ములాఖత్, ఫోన్ సౌకర్యం, లైబ్రరీ, వంటశాల, జైలు ఇండస్ట్రీలలో పనితీరు పరిశీలించి బాగుందని అధికారులను అభినందించారు. ఖైదీలతో మాట్లాడుతూ పోక్సోయాక్టు, ఎస్‌డీసీఎస్, మోటార్ వెహికల్ యాక్టు, సీనియర్ సిటిజన్ యాక్టు, 498-ఎ యాక్టు వంటి చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా జైలును కూడా సందర్శించి మహిళా ఖైదీలతో మాట్లాడుతూ వారి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. జైలులో మహిళా ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రైవేట్ లాయరును పెట్టుకునే స్తోమత లేని ఖైదీలకు ప్రభుత్వ లాయర్‌ను నియమిస్తామన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ శ్రీనివాస్, జైలర్స్ పి శ్రీనివాస్, డిప్యూటీ జైలర్స్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ సుధాకర్ రెడ్డి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్ తణుకు మహేష్ పాల్గొన్నారు.

కలెక్టర్ జన్మదిన వేడుకలు

సుభాష్‌నగర్, ఆగస్టు 27: టీఎన్‌జీవో ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జన్మదిన వేడుకలను నిర్వహించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్‌డీవో మహేశ్వర్, ఏవో సుధాకర్, టీఎన్‌జీవో నాయకులు నాగుల నరసింహస్వామి, ప్రభాకర్‌రెడ్డి, టీజీవో నాయకుడు మడిపెల్లి కాళీచరణ్, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్ సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్, మహిళ జేఏసీ చైర్మన్ ఇరుమల్ల శారద, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి పాల్గొన్నారు.

వైభవంగా వైష్ణవ కృష్ణాష్టమి సంబరాలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 27: వైష్ణవ కృష్ణాష్టమి సందర్భంగా మంగళవారం నగరంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేక అర్చనలు నిర్వహించారు. వావిలాలపల్లి, సప్తగిరికాలని, గాంధీరోడ్ రామాలయాల్లో, మార్కెట్‌రోడ్, మంకమ్మతోట, విద్యానగర్, జ్యోతినగర్, కట్టరాంపూర్ వేంకటేశ్వరాలయాల్లో అభిషేక పూజలు నిర్వహించారు.

ఆర్యవైశ్య పేద విద్యార్థికి ఆర్థిక సహాయం

కరీంనగర్ టౌన్, ఆగస్టు 27: ఇంజనీరింగ్ చదివేందుకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్న ఆర్యవైశ్య పేద విద్యార్థికి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆర్థిక సహాయాన్ని అందించింది. నగరంలోని కిసాన్‌నగర్‌కు చెందిన నార్ల మనోహర్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన కుమారుడు నార్ల అరుణ్‌కుమార్ కొండగట్టు జెఎన్‌టీయులో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. తన కొడుకు ఫీజులు, ఇతర ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్న తనకు సహాయం చేయాలని మనోహర్ కరీంనగర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నగునూరి రాజేందర్‌ను సంప్రదించారు. దీనితో ఆయన మంగళవారం సంఘ కార్యాలయంలో నార్ల మనోహర్‌కు తన స్వంతంగా రూ.5వేలు ఇవ్వడమే కాకుండా ఆయన స్నేహితుల నుంచి మరో 1500 జమ చేసి అందజేశాడు. కార్యక్రమంలో పట్టణ సంఘం కోశాధికారి సుద్దాల వెంకటేష్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు తనుకు సాయికృష్ణ, పడమటింటి సంతోష్‌కుమార్, తొడుపునూరి హరిప్రసాద్, కొంజర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

కవిత బెయిల్ విషయం

బీఆర్ఎస్ నేతలకు ముందే ఎలా తెలుసు?

-ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్/తిమ్మాపూర్, ఆగస్టు 27: కేంద్ర ప్రభుత్వానికి చెందిన పలువురు ఢిల్లీ పెద్దల ప్రమేయంతోనే ఢిల్లీ మద్యం కేసులో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు అవుతుందనే ముందస్తు సమాచారంతోనే బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, గంగుల కమలాకర్‌లు ముందుగానే ఢిల్లీకి చేరుకున్నారని మానకొండూర్ ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె కవిత ఒక బాధ్యత గల ఎమ్మెల్సీ పదవిలో కొనసాగుతూ తెలంగాణ మహిళా సమాజం తలదించుకునేలా మద్యం కుంభకోణం కేసులో నిందితురాలిగా ఉందన్నారు. 166 రోజుల పాటు తీహార్ జైల్లో శిక్ష అనుభవించి బెయిల్‌పై విడుదలవుతుండగా దాన్ని పెద్ద ఘనకార్యం సాధించినట్లుగా బీఆర్ఎస్ నాయకులు స్వీట్లు పంచుకోవడం సిగ్గుచేటన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్ 27: పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మన గణపతి మట్టి గణపతే అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలు కాకుండా మటితో తయారు చేసిన గణపతి విగ్రహాలను పెట్టి పూజించా లన్నారు. అనంతరం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో పది సంవత్సరాలుగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంటాల శ్రీనివాస్, జె రమణ, టి తరుపతి, వేణుగోపాల్ శర్మ పాల్గొన్నారు.

●కరీంనగర్ టౌన్, ఆగస్టు 27: ప్రతి సంవత్సరం నగరపాలక సంస్థ పక్షాన ప్రతి డివిజన్‌లో 200 మట్టి వినాయకులను పంపిణీ చేశారని, ఈయేడు కూడా ఇవ్వాలని కార్పొరేటర్లు మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. మంగళవారం ఈమేరకు అన్ని పార్టీలకు చెందిన కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, నేతికుంట యాదయ్య, సరిళ్ళ ప్రసాద్, దిండిగాల మహేశ్, కుర్ర తిరుపతి, పిట్టల శ్రీనివాస్, జంగిలి ఐలేందర్‌యాదవ్, కంసాల శ్రీనివాస్ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్‌ని ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

గద్దపాక పంచాయతీని విభజించొద్దు

శంకరపట్నం, ఆగస్టు 27: శంకరపట్నం మండలం గద్దపాక గ్రామపంచాయతీని విభజించి అంబేద్కర్‌నగర్ పేరిట నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు చేయవద్దంటూ దళిత కాలనీవాసులు మంగళవారం శంకరపట్నం మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. గద్దపాక గ్రామపంచాయతీ ఏర్పడినప్పటి నుంచి గ్రామపంచాయతీలోనే కొనసాగుతున్నామని, ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు పేర్కొన్నారు. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. కేశవపట్నం ఎస్ఐ రవి సిబ్బందితో కలిసి రాస్తారోకో విరమించాలని సూచించారు. ఆందోళనకారులకు నచ్చజెప్పి ఎస్ఐ రవి రాస్తారోకో విరమింపజేశారు. రాస్తారోకో విరమించి వారు అక్కడి నుంచి ఎంపీడీవో కార్యాలయం చేరుకొని ఎంపీడీవో కృష్ణప్రసాద్‌తో తమ గోడు వెళ్లబోసుకున్నారు. అంబేద్కర్ నగర్ గ్రామపంచాయతీ ఏర్పాటు చేయవద్దు అంటూ దళిత కాలనీవాసులు ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. మీ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎంపీడీవో వారికి హామీ ఇచ్చారు.

ఎల్ఎండీ వద్ద కంట్రోల్ బ్లాస్టింగ్‌పై అధికారుల బృందం పరిశీలన



ఎల్ఎండీ వద్ద పరిశీలిస్తున్న అధికారుల బృందం

తిమ్మాపూర్, ఆగస్టు27: కరీంనగర్ పరిధిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న మానేరు రివర్ ఫ్రంట్ రెండవ దశ పనులకు సంబంధించి లోయర్ మానేరు రిజర్వాయర్ వద్ద నిర్మించ వలసిన రక్షణ గోడలకు సంబంధించి కరీంగనర్ ఇరిగేషన్ ఈఎన్‌సీ శంకర్ ఆధ్వర్యంలోని ముగ్గురు చీఫ్ ఇంజనీర్ల బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మానేరు రివర్ ఫ్రంట్‌కు సంబంధించి ఎల్ఎండీ నిర్మించ వలసిన రక్షణ గోడలకు సంబం ధించి పునాదులలో వచ్చే రాయిని బ్లాస్టింగ్ విధానంలో తొలగించుటకు కంట్రోల్ బ్లాస్టింగ్ చేయవలసిన ఆవశ్యకతను పరిశీలించినట్లు తెలిపారు. ఏ చైనేజీ వద్ద ఎటువంటి బ్లాస్టింగ్ విధానాన్ని అనుస రించాలనే దాన్ని పరిశీలించామన్నారు. పనులు పురోగతిలో ఉన్నాయని, నది గర్భంలోని రాక్‌ను తీయడానికి, ఎక్కడైతే హ్యాబిటేషన్‌లు ఉంటే అవి తొలగించడానికి కంట్రోల్ బ్లాస్టింగ్ అవసరమవు తుందని అన్నారు. బ్లాస్టింగ్ చేసే సమయంలో ఇటు డ్యాంకు గాని, ఇతర నిర్మాణాలకు గాని ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడటం కొరకే పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ ఈఎన్‌సీ బి.శంకర్, క్వాలిటి కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ వెంకటకృష్ణా, సీడీవో చీఫ్ ఇంజనీర్ హైదరాబాద్ మోహన్ కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ, ఇరిగేషన్ ఐసి-1, ఎల్ఎండీ పెద్ది రమేష్, ఈఈ లు బుచ్చిరెడ్డి, నాగభుషణం, డీఈలు ఎం.వేణుగోపాల్, సత్యనారాయణ, ఏఈలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వ్యవసాయ పరపతి సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, ఆగస్టు 27: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర వ్యవసాయ పరపతి సంఘం నూతన భవనాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణమాఫీ చేశారన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో అనేక రైతు సొసైటీలు ఉన్నాయన్నారు. రైస్‌మిల్ ఏర్పాటు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి భూమి ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ సంఘాలనే బ్యాంకు కౌంటర్లుగా తయారు చేయాలని అన్నారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో జనరిక్ మెడిసిన్స్ అతి తక్కువ ధరలో అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సహకార సంఘం ఆధ్వర్యంలో రైసు మిల్లు, పంపు దినుసులు పట్టే మిల్లు ఏర్పాట్లు చేస్తు న్నామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు దూలం బాలగౌడ్, కురిక్యాల అధ్యక్షుడు తిరుమల్‌రావు, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో జనార్దన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మనోహర్, గంగాధర సింగిల్ విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, ఏఎంసీ ఉపాధ్యాక్షుడు కరుణాకర్, డైరెక్టర్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

'వాగేశ్వరి' అధ్యాపకుడికి డాక్టరేట్



శ్రీధర్‌రెడ్డి

తిమ్మాపూర్, ఆగస్టు 27: మండల కేంద్రంలోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న కంకశాల శ్రీధర్‌రెడ్డికి డాక్టరేట్ పొందారని విద్యా సంస్థల జనరల్ సెక్రెటరీ గంద్రా శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 'డిజైన్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫ్ క్వశ్చన్ అండ్ ఆన్సరింగ్ సిస్టమ్ యూజింగ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఉత్తర ప్రదేశ్‌కు చెందిన గ్లోకల్ యూనివర్సిటీ డాక్టరేట్ అందిం చినట్లు తెలిపారు. శ్రీధర్‌రెడ్డిని జనరల్ సెక్రెటరీ గంద్రా శ్రీనివాస్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ వినోద్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విభాగాధిపతి చంద్రమౌళి అభినందించారు.

ఎమ్మెల్సీ కవితకు బెయిల్‌పై బీఆర్ఎస్ సంబరాలు

హుజూరాబాద్, ఆగస్టు 27: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై విడుదల కావడంపై బీఆర్ఎస్ నాయకులు మంగళవారం సంబరాలు నిర్వహించారు. జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, బండ శ్రీనివాస్, శ్రీనివాస్, రాజు, నరేష్, ఇమ్రాన్, రమేష్, లావణ్య, సుశీల, అయిలయ్య, రాజిరెడ్డి, సమ్మయ్య, శ్రీధర్, సారయ్య పాల్గొన్నారు.

● **రాజకీయ కుట్రలో న్యాయమే గెలిచింది**

గంగాధర: రాజకీయ కుట్రలో చివరికి న్యాయమే గెలిచిందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

నల్ల బ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

హుజూరాబాద్, ఆగస్టు 27: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో తమ కోరికలు తీర్చకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కార్మికులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కోరికల సాధన కోసం కార్మికులంతా ఏర్పడి దశల వారి ఉద్యమాన్ని చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు సింగ్, కిశోర్, రవీందర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్, ఆగస్టు 27: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్‌పై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాహనం నడిపే వారందరూ హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి వాహనం వెంట ఆర్సీ, ఇన్సూరెన్స్, లైసెన్స్ తప్పకుండా ఉంచుకోవాలన్నారు. అనంతరం నంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో టౌన్ సీఐ తిరుమల్, ఎస్ఐ షేక్ యూసీపీ, డీడీ మహ్మద్‌అలీ, సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● **విద్యార్థి దశలోనే మంచి అలవాట్లు చేసుకోవాలి**

జమ్మికుంట: విద్యార్థి దశలోనే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని హుజూరాబాద్ ఏసిపి శ్రీనివాస్‌జీ అన్నారు. పట్టణంలో డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ యువత వేసే ప్రతి అడుగు జీవితాన్ని ప్రభావితం చేస్తుందన్నారు. ఒకసారి డ్రగ్స్‌కు బానిస అయితే జీవితం నాశనం అవుతుందని గుర్తుంచుకోవాలన్నారు. సమాజంలో రోజు రోజుకు సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయని, జాగ్రత్తగా ఉండాలన్నారు. అనవసరమైన యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోని జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వరంగంటి రవి, ఎస్ఐ వివేక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్, చాణక్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దబ్బెట రవీందర్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయుష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

భగత్‌నగర్, ఆగస్టు 27: కరీంనగర్ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ హోమియో, ఆయుర్వేద వైద్యశాలల ఆధ్వర్యంలో వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఇందిరానగర్‌లోని పెన్షనర్స్ భవన్ లో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి వందమంది హాజరయ్యారు. ఆయుర్వేద సీనియర్ వైద్యాధికారి డాక్టర్ సంజీవ్ కుమార్, హోమియో సీనియర్ వైద్యాధికారి డాక్టర్ శేఖర్, వృద్ధులను పరీక్షించి తగు సూచనలు చేశారు. యోగ వైద్య నిపుణురాలు డాక్టర్ రజిత ఆరోగ్యానికి సంబంధించి పలు యోగాసనాలు వేయించి తగు మెలకువలు నేర్పారు. వైద్య శిబిరంలో ఆయుష్ శాఖ కరీంనగర్ డిపిఎం ప్రవీణ్ కుమార్, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ సదానందం, డాక్టర్ అమర్నాథ్, పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి, కోశాధికారి నరేందర్, వైస్ ప్రెసిడెంట్ రాజమణి సభ్యులు శంషుద్దీన్, రాజమల్లయ్య, రామకృష్ణారెడ్డి, రామచంద్ర రావు, ఆయుష్ శాఖ ఫార్మసిస్టులు రాజేశ్వర్, విజయేం దర్, పుష్పలత, శ్రీహర్ష సిబ్బంది పుష్ప, శ్యామ్, మధు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా సాగు నీటి వినియోగం

కరీంనగర్ రూరల్, ఆగష్టు 27: కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామంలోని మన్నెకుంటలో ఓ రైతు ఈత చెట్టుకు కరెంటు మీటర్ బిగించుకుని తన పొలానికి నీరు పారించుకుంటున్నాడు. కుంటలో మోటర్‌లు పెట్టకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ నీటిని తరలించుకుంటున్నాడు. నీరు తరలించే క్రమంలో పక్కనే ఉన్న పత్తి చేనులోకి నీరు చేరి మొత్తం నాశనం అవుతుందని గ్రామానికి చెందిన వేల్పుల మాధవరావు తెలిపాడు. కుంటలో విద్యుత్ మోటార్‌లు బిగించడంపై పలు మార్లు సంబందిత ఏఈకి, ఎడికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని తెలిపాడు. ఈత చెట్టుకు ప్రమాదరకంగా ఉన్న విద్యుత్ మీటర్‌ను తొలగించాలని కోరారు.

మేయర్ సునీల్‌రావును బర్తరఫ్ చేయాలి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 27 : కరీంనగర్ నగర పాలనను గాలికి వదిలేసి గోప్యంగా అమెరికాకు వెళ్లిన మేయర్ సునీల్ రావును జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గోప్యంగా విదేశీ పర్యటనకు వెళ్లాల్సిన అవసరం ఎందుకొచ్చిందో సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

●బీఆర్ఎస్ కేంద్రంలోని బీజేపీ పెద్దలతో కుమ్మక్కు కావడం వల్లే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ లభించిందని వెలిచాల రాజేందర్‌రావు ఆరోపించారు.

డయాగ్నస్టిక్స్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 27: అధిక చార్జీలు వసూలు చేస్తున్న డయాగ్నస్టిక్స్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల మహేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని కార్యలయంలో కార్యవర్గం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పారునంది జలపతి, దేవయ్య, కరుణాకర్, నర్సయ్య, అంకుష్ రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ వీసీపై ఆరోపణలను ఖండిస్తున్నాం

సుభాష్‌నగర్, ఆగస్టు 27: శాతవాహన యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ టంకశాల మల్లేశంపై మాజీ కాంట్రాక్టు లెక్చరర్ పెంచాల శ్రీనివాస్ చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత లిబరేషన్ ఫ్రంట్ అధ్యక్షుడు చేర్ల ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్ అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

డీవైఎస్‌వోకు సన్మానం

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 27: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన జిల్లా యువజన, క్రీడా శాఖాధికారి వి శ్రీనివాస్‌గౌడ్‌ను జిల్లా టీఎన్‌జీవోల సంఘం అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ మాట్లాడుతూ జాతీయ క్రీడల దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 29న అంబేద్కర్ స్టేడియంలో ఉద్యోగులకు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఆసక్తి కలవారు 9640987943 నెంబర్‌కు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

● సంక్షిప్త సమాచారం..

●జమ్మికుంట రూరల్: మండలంలోని బిజిగిరిషరీఫ్ గ్రామంలో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కార్తీక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.

- జమ్మికుంటలో సీఐగా పని చేసిన ప్రస్తుత ఏసీపీ పింగిలి ప్రశాంత్‌రెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందారు. బీజేపీ నాయకులు కమలాపూర్ మండలం శనిగరంలో ఏసీపీ ప్రశాంత్‌రెడ్డిని పరామర్శించారు.

●జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7600 రూపాయలు పలికింది.

●హుజూరాబాద్: పట్టణంలోని 29వ వార్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం డ్రైడే నిర్వహించారు.

● శంకరపట్నం: మండలంలోని ముత్తారం రామసముద్రం చెరువు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

- మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయంలో చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

● రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకులు నిర్వహిచారు. కార్యక్రమంలో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

- మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య నిర్మూలన పనులను చేపట్టాలని కోరుతూ ఎంపీడీవోకు టీఎస్సీ నాయకు లు వినతి పత్రం సమర్పించారు.

- మండల కేంద్రంలోని అక్షర హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఓపెన్ కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో తొమ్మిది గోల్డ్, ఆరు సిల్వర్, మూడు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ రాజు తెలిపారు.

- మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి మూడు పంపుల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి ఎత్తిపోస్తున్నారు.

● తిమ్మాపూర్: మానకొండూర్ ఏడీఏగా ఇటీవల బాధ్యత లు స్వీకరించిన శ్రీధర్‌ను గన్నేరువరం వ్యవసాయ దికారి కిరణ్మయి, ఫర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆటికం తిరుపతి, సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు.

● మానకొండూర్: మండలంలోని దేవంపల్లి గురుకులం విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు.

- మండలంలోని కొండపల్కల బాలవికాస నీటి శుద్ధీకరణ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది.

● చిగురుమామిడి: రెండో వార్డులో సీసీ రోడ్డు పనులకు మాజీ జడ్పీటీసీ రవీందర్ భూమిపూజ చేశారు.

-మండల కేందంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సెప్టెంబరు 3 నుంచి ఎస్జీఎఫ్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో కొమ్మెర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

- మండలంలోని రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సా రించాలని హార్టికల్చర్ అదికారి బి మంజువాణి అన్నారు. మండలంలోని సుందరగిరికి మహేందర్‌రెడ్డి అనే రైతుకు చేందిన భూమిలో ఆయిల్ పామ్ మొక్కలను నాటారు.

● చొప్పదండి: పట్టణంలోని బ్రాహ్మణకుంట శిఖం భూమిని కబ్జా కాకుండా కాపాడాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఇరిగేషన్ శాఖ ఈఈ సుధాకిరణ్, డీఈ రూపాలాల్‌ను కోరారు.

-మండలంలోని భూపాలపట్నం సెయింట్ మదర్ థెరిస్సా పాఠశాలలో మదర్ థెరిస్సా జయంతిని, కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు.